బలహీన వర్గాల అభివృద్ధికి సీఎం జగన్ కృషి

జంగారెడ్డిగూడెం: బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, వారి అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. జంగారెడ్డిగూడెం 1వ వార్డులో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నాయకులు, కార్యకర్తలు, అధికారులతో కలిసి గడపగడపకూ ఎమ్మెల్యే తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ, వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరినీ అభివృద్ధి బాటలో తీసుకువెళ్లేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారన్నారు. బలహీన వర్గాల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి ఇంటి వద్ద ప్రజలు సంతోషంగా ఆహ్వానిస్తూ ఆశీర్వదిస్తున్నారన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, వైసీపీ పట్టణ అధ్యక్షుడు పీఎస్ చంద్రరావు, మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, స్థానిక కౌన్సిలర్ ముప్పాని రమణ, సీనియర్ నాయకులు బత్తిన చిన్న, మల్నీడి బాబి, కంచర్ల విష్ణు, వందనపు వెంకటేశ్వరరావు, బి.పార్ధసారధి, గంజి వినోద్, కౌన్సిలర్లు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, మున్సిపల్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


జంగారెడ్డిగూడెంలో ప్రజలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా


కన్నాపురంలో పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

నియోజకవర్గంలో అభివృద్ధి వేగవంతం

కొయ్యలగూడెం: పోలవరం నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా మూడున్నర సంవత్సరాల కాలంలో అభివృద్ధి వేగవంతమైందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. కన్నాపురం గ్రామ సచివాలయం-2 పరిధిలో శుక్రవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గంలో రూ.1,100 కోట్లతో కేవలం సంక్షేమ పథకాలకు, ప్రజాభివృద్ధికి వెచ్చించామన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేని ప్రతిపక్ష నాయకులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేయాలని చూస్తున్నాయన్నారు. సార్వత్రిక ఎన్నికల నుంచి కొనసాగుతున్న అన్ని ఎన్నికలలో ప్రజలు ఇస్తున్న తీర్పుతో చావు దెబ్బలు తింటున్న టీడీపీకి రాబోయే అసెంబ్లీ ఎన్నికలు చివరివని అన్నారు. వైఎస్సార్ సీపీ మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని, కుప్పంలో చంద్రబాబు నాయుడు ఓటమితో టీడీపీ భూస్థాపితం కానుందని జోస్యం చెప్పారు. గడపగడపకు నిర్వహిస్తున్న కార్యక్రమాల వల్ల క్రమేపీ సమస్యలు తగ్గుముఖం పట్టాయన్నారు. సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని దీనికి అధికారులు కూడా సహకరిస్తున్నారన్నారు. కన్నాపురంలో పీహెచ్‌సీ, ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలని వినతులు వచ్చాయన్నారు. పడమటి కాలువ, తూర్పు కాలువలపై హై లెవెల్ బ్రిడ్జిలు నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు. ఎంపీపీ గంజిమాల రామారావు, గ్రామ కన్వీనర్ గాడిచర్ల సోమేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు కొండపల్లి శివాజీ, సర్పంచ్ ఉప్పల పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు యడ్లపల్లి సురేష్, ఎండీ షాబాజీ, ఉప్పల కృష్ణ, ఎండాపు సత్యనారాయణ, వల్లూరి పద్మావతి, కలుగు ప్రమీల, ఉందుర్తి శ్రీను, కాటుపోయిన సురేష్, సోంగా రాకేష్, మండ ప్రసాద్, గడ్డం చింటూ, ముప్పిడి నాగేశ్వరరావు, అరిగల సత్యనారాయణ, పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తులకు 14 రోజుల రిమాండ్

చింతలపూడి: హత్యా ప్రయత్నం కేసుకు సంబంధించి ఇద్దరు వ్యక్తులకు చింతలపూడి కోర్టులో 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై డి హరికృష్ణ శుక్రవారం తెలిపారు. ఈ నెల 15న స్థానిక సాయిబాబ గుడి సమీపంలోని టిఫిన్ సెంటర్‌లో లింగపాలెం మండలం, కల్యాణంపాడు గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులపై చింతలపూడి మండలం వద్రుగూడెంకు చెందిన డేరంగుల సందీప్, తరుణ్ అనే ఇద్దరు యువకులు గొడవ పడి బ్లేళ్లతో ఉద్దేశపూర్వకంగా దాడి చేసినట్లు తెలిపారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన ఎస్సై హరికృష్ణ శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఎస్‌కే ఇబ్రహీం షరీఫ్ జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు చెప్పారు.

రూ.59.39 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు

బుట్టాయగూడెం: ఆర్‌అండ్‌బీ సబ్ డివిజన్ పోలవరం నియోజకవర్గ పరిధిలో సుమారు రూ. 59.39 కోట్ల వ్యయంతో 6 రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టినట్టు ఆర్‌అండ్‌బీ డీఈ సీహెచ్ హరికృష్ణ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత శిక్షణ, ఉపాధి కల్పనకు సంబంధించి స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన భవన మరమ్మతులకు సంబంధించి ప్రతిపాదనలను శుక్రవారం తయారు చేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 6 పనులు గిరిజన ఉప ప్రణాళిక నిధులతో చేపట్టినట్టు చెప్పారు. దాదాపు 120 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు చేపట్టినట్టు చెప్పారు. సంవత్సరం లోపు పనులు పూర్తి చేసేవిధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలవరం నుంచి రేపల్లె తాలూకా ఆఫీస్ వరకూ 11 కిలోమీటర్ల మేర రూ. 4.15 కోట్ల నిధులతో పనులు చేపట్టినట్టు చెప్పారు. బుట్టాయగూడెం నుంచి దొరమామిడి మీదుగా పూచికపాడు రోడ్డు 22 కిలోమీటర్ల మేర రూ. 7.45 కోట్ల నిధులతో ఆధునికీకరిస్తున్నట్టు చెప్పారు. బర్రింకలపాడు నుంచి పూచికపాడు 9 కిలోమీటర్ల మేర రూ. 5.20 కోట్లతో పనులు చేపట్టామన్నారు. బూరుగుంపాడు- అశ్వారావుపేట రోడ్డు 45 కిలోమీటర్లకు రూ. 34.50 కోట్ల నిధులు మంజూరయ్యాయని అన్నారు. మేడేపల్లి నుంచి రెడ్డిగూడెం క్రాస్‌రోడ్డు వరకూ రూ. 2 కోట్లు, బైనగూడెం- రేగులకుంట రోడ్డుకు రూ. 6 కోట్ల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. విలీన మండలాలైన వేలేరుపాడు, కుక్కునూరు మండలంలో సుమారు రూ. కోటితో తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టామన్నారు. బుట్టాయగూడెం, కొయ్యలగూడెం మండలాల్లో రూ. 80 లక్షలతో తాత్కాలిక రోడ్డు మరమ్మతు పనులు చేపట్టినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, స్కిల్ డెవలప్‌మెంట్ హెచ్‌ఆర్ కిశోర్ రెడ్డి, ప్రిన్సిపాల్ జీబీ హనుమాన్, స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ కె. నాగదుర్గ, వైఎస్సార్‌సీపీ నాయకులు యాండ్ర రవి పాల్గొన్నారు.


జూనియర్ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ఏర్పాటుపై చర్చిస్తున్న ఆర్‌అండ్‌బీ డీఈ

విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

జంగారెడ్డిగూడెం: విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషిచేస్తోందని విద్యాశాఖ ఆర్‌జేడీ, ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జ్ డీఈవో డి.మధుసూధన్‌రావు అన్నారు. జంగారెడ్డిగూడెం జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్లో డివిజన్ స్థాయిలో నాడు-నేడు పనుల పురోగతిపై శుక్రవారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 58వేల కోట్లు ఖర్చు చేసిందని ఆయన అన్నారు. ఏలూరు జిల్లా పరిధిలోని 2వేల పాఠశాలల్లో, ఇప్పటికే నాడు-నేడు ద్వారా 1,500 పాఠశాలలను అభివృద్ధి చేశామన్నారు. మిగిలిన పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు త్వరలో పనులు చేపడతామన్నారు. విద్యార్థుల అవసరాల దృష్ట్యా 880 అదనపు తరగతి గదులను నిర్మిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో త్వరలో సీబీఎస్ఈ విద్యను ప్రవేశపెట్టేందుకు కృషి చేస్తున్నామని ఆర్‌జేడీ మధుసూదనరావు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలోని కొన్ని పాఠశాలల్లో సీబీఎస్ఈని అమలు చేస్తున్నామన్నారు. రాబోయే 2024-25 విద్యాసంవత్సరంలో రాష్ట్రంలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులు సీబీఎస్ఈ విధానంలో పరీక్షలు రాసేవిధంగా ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులతో నాడు -నేడు పనులు, అదనపు తరగతి గదుల నిర్మాణం తదితర అంశాల పురోగతిపై చర్చించారు. సమీక్ష సమావేశంలో ఎస్ఎస్ఏ డీఈ పొలపర్తి రమణకుమారి, ఈఈ జయపాల్, డీవైఈవో రామన్నదొర, ఎంఈవోలు బి.రాముడు, జె.సురేష్‌బాబు, పాఠశాల హెచ్ఎం గెడా జగ్గారావు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.


జంగారెడ్డిగూడెంలో డివిజన్ స్థాయిలో నాడు-నేడు పనులపై సమీక్షిస్తున్న విద్యాశాఖ ఆర్‌జేడీ, ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జ్ డీఈవో

నష్టపోయిన మిర్చి రైతులను ఆదుకోవాలి

జంగారెడ్డిగూడెం రూరల్: నల్ల తామర పురుగు వైరస్ తెగుళ్లతో నష్టపోయిన మిర్చి రైతులకు ఎకరాకు రూ.లక్ష నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం పట్టెన్నపాలెంలో నల్ల తామర పురుగు వైరస్ తెగుళ్లతో మిర్చి పంటకు వచ్చిన నష్టాలను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో జంగారెడ్డిగూడెం, ముసునూరు, ఆగిరిపల్లి, లింగపాలెం, కుక్కునూరు, వేలేరుపాడు తదితర మండలాలలో వేలాది ఎకరాల్లో మిర్చి పంటను రైతులు సాగు చేస్తున్నారని చెప్పారు. నల్ల తామర పురుగు, వైరస్ తెగుళ్లతో మిర్చి పంటకు తీవ్ర నష్టం ఏర్పడిందన్నారు. ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.50 వేలకు పైగా రైతులు మిర్చి సాగుకు పెట్టుబడి పెట్టారని చెప్పారు. తెగుళ్ల కారణంగా దిగుబడి భారీగా తగ్గుతుందని అన్నారు. నల్ల తామర పురుగు వైరస్ తెగులును రాష్ట్ర విపత్తుగా ప్రకటించి, పంట నష్టాలను నమోదు చేసి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. తెగుళ్ల నివారణకు ఉద్యాన శాఖ ద్వారా తగు చర్యలు చేపట్టాలని కోరారు. పంటల బీమా పథకం మిర్చి రైతులకు వర్తింపజేయాలన్నారు.. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొద్దు రాంబాబు, మండల అధ్యక్షుడు బోడిక రామచంద్రరావు, రైతు నాయకులు దాసరి మధు, పట్టెన్న పాలెం మాజీ సర్పంచ్ ఆకుల చల్లారావు, మిర్చి రైతులు గూడుపు శ్రీనివాసరావు, పసుపులేటి లక్ష్మీనారాయణ, సింగులూరి రాంబాబు పాల్గొన్నారు.


వైరస్ సోకిన మిర్చి పంటను పరిశీలించిన రైతు సంఘం నాయకులు

కోఆర్డినేటర్‌కి అభినందనలు

కొయ్యలగూడెం: వచ్చే సార్వత్రిక ఎన్నికలలో సచివాలయాల కన్వీనర్లు, మండల సచివాలయాల కోఆర్డినేటర్ గురతర బాధ్యత వహించాల్సి ఉందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. కొయ్యలగూడెం మండల సచివాలయాల కోఆర్డినేటర్‌గా శుక్రవారం నియామకం పొందిన వైఎస్సార్‌సీపీ యూత్ నాయకులు నూకల రాము అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో రెండు కళ్లుగా వ్యవహరిస్తే వారిని సమన్వయం చేసుకొని అభివృద్ధి బాట పట్టించాల్సిన బాధ్యత కోఆర్డినేటర్‌పై ఉందన్నారు. పోలవరం నియోజకవర్గంలో ఏడు మండలాలకు ఏడుగురు కోఆర్డినేటర్లను నియమించామన్నారు. వీరికి రాష్ట్ర కోఆర్డినేటర్, ఎమ్మెల్యే పుత్ర ప్రతాపరెడ్డి ఇప్పటికే దిశా నిర్దేశం చేశారన్నారు.సచివాలయాల కన్వీనర్లను కలుపుకొని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని రాము తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, మారిశెట్టి శ్రీను, పల్లంట్ల శ్రీను, చిటికెన నాగార్జున, ఏలేటి భాస్కర్, గొలిశెట్టి ప్రసాద్, మన అయ్యప్ప, సాజిద్ పాల్గొన్నారు.


కొయ్యలగూడెంలో రాముని అభినందిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

నూకాలమ్మ ఆలయానికి రూ.1,01,116 విరాళం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం శ్రీ చక్ర సహిత నూకాలమ్మవారు శుక్రవారం సందర్భంగా విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. పాలకొల్లు వాస్తవ్యులు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు ఆలయానికి విచ్చేసి, అమ్మ వారిని దర్శించి, పూజలలో పాల్గొన్నారు. తొలుత ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ, కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. అమ్మ వారి చిత్ర పటాన్ని అందించి సత్కరించారు. ఈ సందర్భంగా మేక శేషుబాబు మాట్లాడుతూ అమ్మ వారిని దర్శించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ డాక్టర్ రాజాన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి పసుపులేటి సత్యనారాయణ జ్ఞాపకార్థం భార్య అన్నపూర్ణా దేవి, కుమారుడు చంద్రశేఖరబాబు(ఐఆర్ఏఎస్), నాగభవ్య దంపతులు రూ.1,01,116 విరాళంగా ఇచ్చారని తెలిపారు. అనంతరం దాతలను ఆలయ మర్యాదలతో అమ్మ వారి శేష వస్త్రాన్ని, చిత్ర పటాన్ని అందించి వేద ఆశీస్సులతో ఘనంగా సత్కరించారు. శుక్రవారం కావడంతో ప్రధాన అర్చకులు మనోజ్ శర్మ ఆలయ కల్యాణ కళా వేదిక వద్ద ఉత్సవ మూర్తికి పంచామృతాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం, మూలవిరాట్‌కు సాయం సంధ్యా హారతి పూజలు, వేదదర్బారు సేవ చతుర్వేద స్వస్తి, నిత్య పూజా కైంకర్యాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


నూకాలమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబుకు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న కమిటీ సభ్యులు

రహదారి నియమాలు ఆచరించాలి

జంగారెడ్డిగూడెం: విద్యార్థులు రహదారి నియమాలు తెలుసుకుని వాటిని పాటించాలని జంగారెడ్డిగూడెం డీఎస్పీ కేవీ సత్యనారాయణ, ఆర్టీవో మదని అన్నారు. జంగారెడ్డిగూడెంలోని విద్యావికాస్ విద్యాసంస్థల్లో శుక్రవారం రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహదారి నియమాలు ఆచరించడం వల్ల కుటుంబాలు సంతోషంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇనెస్పెక్టర్ కేవీఎస్ ప్రసాద్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇనెస్పెక్టర్ ప్రవీణ, సీఐ బాలసురేష్‌బాబు, ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ తదితరులు రోడ్డు భద్రతా నియమాలను వివరించారు. కార్యక్రమలో విద్యావికాస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ సతీష్‌చంద్, విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతను పాటించాలి

కామవరపుకోట: గ్రామాల్లో ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.శ్రీదేవి అన్నారు. శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ కార్యక్రమంలో భాగంగా కామవరపుకోట పంచాయతీలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. మండలంలో 8 గ్రామ పంచాయతీల క్లాప్ మిత్రలు ఈ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కె.శ్రీదేవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన గ్రామాలను రూపొందించే దిశగా జగనన్న స్వచ్ఛ సంకల్పం (జేఎస్ఎస్) కార్యక్రమం చేపట్టారని అన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి క్లీన్ ఆంధ్రప్రదేశ్ దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కామవరపుకోట సర్పంచ్ కరిపోతు అనూష భాగ్యరాజు, కార్యదర్శి జీడీ శ్రీనివాసరావు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఉద్యమాలు

జంగారెడ్డిగూడెం: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖలో నిర్వహించనున్న ఉద్యమానికి సంఘీభావంగా జనవరి 23,24 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అన్ని రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల వద్ద దీక్షలు, 25వ తేదీన కలెక్టర్ కార్యాలయాల వద్ద చేపట్టే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద దీక్షలకు సంబంధించిన గోడ పత్రికలను కృష్ణ చైతన్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దేశంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ సంస్థలను ఒక్కొక్కటిగా ప్రైవేటీకరణ చేస్తోందన్నారు. అందులో భాగంగానే విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయడానికి సిద్ధమవుతున్న కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఏఐటీయూసీ, ఉక్కు పరిశ్రమలోని కార్మిక సంఘాలన్నీ కలిసి ఉద్యమం చేస్తున్నాయన్నారు. విశాఖపట్నంలో నిర్వహించనున్న ఉద్యమానికి మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దీక్షలు, నిరశన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. జనవరి 23న నూజివీడు ఆర్డీవో కార్యాలయం వద్ద, 24న జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయం వద్ద, 25న ఏలూరు ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. 27న విశాఖలో లక్ష మందితో భారీ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జె.వి.రమణ రాజు, మండల సహాయ కార్యదర్శి కుంచె వసంత రావు, మండల కమిటీ సభ్యులు చిట్టూరి వెంకటేశ్వరరావు, గొలిమే బాల యేసు, నాగరాజు, హనుమంతు, శీనయ్య, కృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పంట నమోదు చేయించాలి

జంగారెడ్డిగూడెం రూరల్: పేరంపేట, పంగిడిగూడెంలో వరి పొలాలను శుక్రవారం మండల వ్యవసాయాధికారి కెవీఎస్ పోశారావు పరిశీలించారు. వరిలో కాండం తొలచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు ఏవో పోశారావు తెలిపారు. సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు ఇప్పలపాడులో ‘గడపగడపకు’

బుట్టాయగూడెం: ఇప్పలపాడులో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇప్పలపాడు, తాడితోట గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

టి.నరసాపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా మంజూరు చేసిన గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ జి.రాధాకృష్ణ అధికారులను ఆదేశించారు. బండివారిగూడెంలో గృహ నిర్మాణాలపై శుక్రవారం సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్. నాగలక్ష్మి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నెరుసు వెంకటేష్, సహాయక ఇంజనీర్ రాధాకృష్ణ, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

చింతలపూడి: అండర్ 17 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు చింతలపూడి జిల్లా పరిషత్ (సుబ్బరాజు) హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న కె సాయిరామ్, 9వ తరగతి చదువుతున్న టి శివచంద్ర ఈ నెల 23,24,25 తేదీల్లో విజయనగరం జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ అండర్ 17 పాఠశాల క్రీడల్లో జిల్లా తరుపున పాల్గొంటారని చెప్పారు. రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన క్రీడాకారులను హెచ్‌ఎం మురళీకృష్ణ, ఆకుల మహేష్, వ్యాయామ ఉపాధ్యాయులు మారుమూడి సీమోను, గ్రామస్తులు అభినందించారు.

పదో తరగతి విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

ద్వారకాతిరుమల: ఒక బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు అందడంతో శుక్రవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం మండలంలోని సత్తాల పంచాయతీ సంద్రకుంటకు చెందిన బొప్పన వెంకటేశ్వరరావుకు ఇద్దరు కుమారులు సంతానం. అందులో 17 సంవత్సరాల వయస్సుగల చిన్నకుమారుడు బొప్పన కొండబాబు 10వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 18న రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో నిద్రించిన కొండబాబు, ఆ మరుసటి రోజు ఉదయం నుంచి కనిపించడం లేదు. కుటుంబ సభ్యులు ఎన్నిసార్లు అతడి సెల్ నంబర్‌కు ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ అని వస్తోంది. చుట్టు పక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో వెంకటేశ్వరరావు స్థానిక పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గొర్రెల గుంపుపై దూసుకెళ్లిన డీసీఎం వ్యాన్

చింతలపూడి: ప్రగడవరం గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి రోడ్డుపై వెళ్తున్న గొర్రెల గుంపుపై డీసీఎం వ్యాన్ దూసుకెళ్లిన సంఘటన చోటు చేసుకుంది. ప్రగడవరంలోని నలుగురు వ్యక్తులకు చెందిన గొర్రెలను మేతకు తీసుకెళ్లి ఇంటికి తోలుకుని వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. ఈప్రమాదంలో 7 గొర్రెలు మృత్యువాత పడగా, మరో 12 గొర్రెలకు గాయాలయ్యాయి. ఈ మేరకు డీసీఎం వాహనాన్ని నిలిపివేసిన గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. గొర్రెల యజమానులకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు.

నేడు బుట్టాయగూడెంలో ఆటల పోటీలు ప్రారంభం

బుట్టాయగూడెం: నేడు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టీబీఆర్ యూత్ ఆధ్వర్యంలో 6 రోజుల పాటు నిర్వహించనున్న ఆటల పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ పోటీలను రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ కవూరు శ్రీనివాస్, మాజీ ఉప ముఖ్యమంత్రి, ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ పాల్గొని జయప్రదం చెయ్యాలని నిర్వాహకులు కోరారు.

బయోకల్చర్‌పై అవగాహన కార్యక్రమం

కామవరపుకోట: విత్తన శుద్ధికి, పంటలోని పురుగు నివారణకు బయో కల్చర్ సేంద్రియ ఎరువు ఎంతో ఉపయోగపడుతుందని ప్రకృతి వ్యవసాయ మండల కోఆర్డినేటర్ హుస్సేన్ బి అన్నారు. మండలంలో శుక్రవారం తడికలపూడి ఆర్‌బీకేలో రైతులకు బయో కల్చర్ సేంద్రియ ఎరువు తయారీ విధానాన్ని వివరించారు. 400 గ్రాముల వరి పిండి, 100 గ్రాముల తెల్ల మొక్కజొన్నపిండి, 100 గ్రాముల నల్లబెల్లంతో బయో కల్చర్ తయారు చేయవచ్చని, దీనిని ఒక ఎకరానికి ఒక లీటర్ బయో కల్చర్‌కి 100 లీటర్ల నీరు కలిపి పంటపై పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్ఎ ప్రేమ్ కుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు శంకుస్థాపన

జంగారెడ్డిగూడెం రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి అన్నారు. ఎ.పోలవరంలో శుక్రవారం జగనన్న ఇళ్ల నిర్మాణాలకు బాబ్జి శంకుస్థాపన చేశారు. యోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుద్దాల సీతారామరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు వామిశెట్టి హరిబాబు, ఎంపీటీసీ పసుపులేటి వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్నీడి బాబి, పారేపల్లి నాగేంద్రబాబు, బండారు సుబ్బారావు, అనిల్, గిరి, నాగు, దొరబాబు, మూర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకారం అందించాలని వినతి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణాభివృద్ధి ప్రత్యేక సహకారం అందించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను జంగారెడ్డిగూడెం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి విన్నవించారు. శుక్రవారం ఏలూరులో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను ఆమె మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం పట్టణానికి ప్రత్యేక సహాయ సహకారాలు అందించాలని కోరారు. పట్టణ పరిధిలో ఉన్న పామాయిల్ ఫ్యాక్టరీ కారణంగా భూగర్భజలాలు కలుషితమవుతున్నాయని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరినట్లు వివరించారు. బత్తిన లక్ష్మి వెంట కౌన్సిలర్ ఉగ్గం దుర్గాప్రసాద్, బత్తిన చిన్న తదితరులు ఉన్నారు.

భోగోలు గ్రామ సచివాలయం తనిఖీ

లింగపాలెం: లింగపాలెం మండలం భోగోలు గ్రామ సచివాలయాన్ని జెడ్పీ సీఈవో రవికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది పనితీరును పీఎంజీఏవోఐ సర్వేను సీఈవో రవి కుమార్ పరిశీలించారు. సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశాలు చేశారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు సక్రమంగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాడేపల్లి శాంతారావు, ఎంపీడీవో ఎస్ ఆశీర్వాదం, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బంధువులకు మహిళ అప్పగింత

కామవరపుకోట: కామవరపుకోట పరిసర ప్రాంతాల్లో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న దుర్గ అనే మహిళను స్థానికులు శుక్రవారం బంధువులకు అప్పగించారు. ఇటీవల స్థానిక కొత్తూరు బస్టాండ్ సెంటర్లో మతిస్థిమితం లేని దుర్గ తిరుగుతోంది. స్థానికులకు ఆమె పేరు, ఊరు మాత్రమే తెలియజేసింది. దీంతో కామ వరపుకోటకు చెందిన సోషల్ వర్కర్ వీరమల్ల మధు, మేడంకి రాజారావు సామాజిక మాధ్యమాల్లో మహిళ వివరాలు పోస్ట్ చేశారు. దీనిని చూసిన నిడదవోలు వార్డు కౌన్సిలర్ అనిల్ తదితరులు దుర్గను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందజేశారు. శుక్రవారం దుర్గ సోద రుడు అప్పన్న వచ్చి దుర్గను తీసుకువెళ్లాడు. ఈ సందర్భంగా మధు, రాజారావు, మున్నంగి శ్రీనివాస్, శీలం చిరంజీవికి, వార్డ్ కౌన్సిలర్ అనిల్‌కు, లక్ష్మికి, దుర్గ సోదరుడు కోటిపల్లి అప్పన్న కృతజ్ఞతలు తెలియజేశారు.